

# పద్మవ్యూహం

## దాసరి అమరేంద్ర

'ఏం సార్? మారుతీ తేలేదా?' ఆశ్చర్యం నిండిన శర్మ ప్రశ్న!

"కమాన్! జోకు లొద్దు. ఈ ఢిల్లీ రోడ్ల మీద సాయంత్రం ఆరుగంటల వేళ కారు నడిపి బ్రతుకుదామనే?! స్కూటరు నడపడం వల్ల ఒళ్లలవడం నిజమే కానీ, మరి మారుతీ నడిపితే మానసికంగా అలసిపోమా!"

స్టాండులోంచి స్కూటరు బయటకు లాగా. స్టార్టు చేసి ముందు కురికించా. వాహనాల ప్రవాహంలో భాగమయ్యాం.

శర్మకూ, నాకూ ఢిల్లీ రాకముందటి నుంచే, పరిచయం. ఒకే కాలేజ్‌లో ఇంజనీరింగు చేశాం. అతను నా కన్నా రెండేళ్లు జూనియరు. అంచేత అతను నన్ను కొంచెం గౌరవించడం, నేను కాస్త పెద్దన్నలా చనువు తీసుకోవడం - మాకు మామూలే. కాలేజీ రోజులనాటి పరిచయం మళ్లీ ఢిల్లీలో ఇద్దరం ఒకే ప్రాంతంలో పనిచేయడం, నివసించడం జరగడంతో స్నేహంగా పరిణమించి, ఆత్మీయతకు దారి తీసింది.

మా శర్మకు వాహన మున్నా దాన్ని ఢిల్లీ ట్రాఫిక్‌లో నడపడమంటే మహాచెడ్డ చిరాకు. అంచేత బుద్ధిగా ఢిల్లీ ఆఫీసు జీవుల జీవితాలకు పట్టుకొమ్మలయిన ఛార్టెర్డ్ బస్సులను పోషించడ మతని కిష్టం. మరి నే నో స్వేచ్ఛా జీవిని గదా - నాకా బస్సుల పంజరాల్లో చిక్కడిపోవడమంటే చిరాకు. కానీ రోజూ మా కాలనీ నుంచి రానూపోనూ 30 కి.మీ. కారులో కన్నాట్‌ప్లేస్ వెళ్లిరావడమంటే పెట్రోలు సంగతి ఎలా ఉన్నా గుండెదడ పెరగడం మాత్రం ఖాయం? మొదట్లో నాలాంటి "పెద్దమనిషి మరీ ఇలా స్కూటరు మీద ఆఫీసుకి వెళ్లడమా' అన్న అహం ప్రభావం వల్ల కారు నడిపి చూసినా అది అనవసరపు టహంభావమని నాలుగు రోజుల్లోనే బోధపడింది. అనవసరపు ఆందోళనా, 'ఎక్కడ కారుకు గుద్ది చొట్టలు మిగులుస్తారో' అని సైకిలు వాళ్లకు కూడా భయపడడం, రోడ్డు మీ దున్న ప్రతి వాహనమూ

మన మారుతీని కబళించే కబంధునిలా కనబడటం - ఇలాంటి వాటి పుణ్యమా అని నా ధైర్యసాహసాలు ఉత్తర కుమారుని స్థాయికి చేరిపోవడం గమనించా. ఇహ లాభంలేదని కారుని గాల్లో కట్టేసి స్కూటరు మీదే నా ప్రయాణాలు సాగిస్తున్నా!

స్కూట రిచ్చిన స్వేచ్ఛ పుణ్యమా అని రోజూ సాయంత్రం ఆఫీసయిన తర్వాత ఓ అరగంటో గంటో ఏదో సంగీత సభనో, కళా ప్రదర్శననో ఓ చూపు చూసి మరీ గూటికి చేరడం నా కలవాటు. ఆనాటి సాహిత్య ఎకాడమీ వారి పుస్తకాల ప్రదర్శనను చూద్దామని ప్రలోభపెట్టి శర్మను నా స్కూటరు వెనక సీట్లో బందీని చేయగలిగా. 'ఐటీవో బ్రిడ్జినీ సాయంకాలపు పీక్ అవర్లో స్కూటరు మీద దాటడం కష్టంగాదాండీ' అని నణుగుతూనే ఒప్పుకున్నాడు శర్మ.

అలా ఇద్దరం ఆఫీ సవగానే రోడ్డున పడ్డాం.

'గురూజీ! మీరు మరీ అన్ని లైన్లూ దున్నేస్తున్నారు. ఏ పోలీ సెంకటసామో చూస్తే మీ చాతుర్యానికి ముచ్చటపడి అత్తారింటికి అతిధిని చేసేయగలడు' మొహమాటంగా గళం విప్పాడు శర్మ.

"నిజమేయ్యా! నేను నాదీ, పరాయిదీ అన్న తేడా లేకుండా అన్ని లైన్లనూ దున్నేస్తూ అల్లిబిల్లిగా పోతోన్నమాట, నిజమే. కానీ ఏం చేస్తాం? నేను బుద్ధిగా నా వరసకే కట్టుబడి ఉంటే మిగతా వాళ్లకు న్యూసెన్సవడం ఖాయం. వాళ్లు చిరాకుపడతారు. ఏదో అంటారే - బీ యే రోమ నిన్ రోమ్ - అని; నే నిపుడు చేస్తున్న దదేమరి! అయినా పెద్ద లనలేదూ - ఆల్ ఈజ్ ఫెయిర్ ఇన్ లవ్ అండ్ వార్ - అని. ఢిల్లీ రోడ్లు రణరంగాలే కదా." పెద్ద లెక్చరే దంచా!

"అవు ననుకోండీ! కానీ మరి మన ఢిల్లీ ట్రాఫిక్ ఛీఫ్ జనరల్ మాక్స్‌వెల్ పెరీరా గారు మీ వీరత్వాన్ని హర్షించకపోవచ్చు. కీర్తి చక్రమో, పరమవీర చక్రమో బదులుగా మీకు ఓ డజను పెనాల్టీ చెలాన్లు మిగల్చొచ్చు."

"ఆఁ! ఆఁ! అదీ అయింది ఇప్పటికి నా స్కోరు ఆరు. ఛలాను అందుకున్న తర్వాత మెత్తబడి ఓ వారం రోజులు పెద్దమనిషి నవుతాను. తర్వాత మామూలే - కుక్కతోక ధోరణిలో పడిపోతాను! చెప్పాగదా - బీ యే రోమన్..."

శర్మ ఏదో గొణిగాడు. 'మీ రోమ్‌ను యమునలో తగలెయ్యండి' అంటున్నాడా?

*** *** ***

ఛల్లగా మెల్లగా సాగుతోన్నాగా చేతక్‌కు హఠాత్తుగా బ్రేకు పడింది!

ఓ ట్రాఫిక్ కానిస్టేబులుగారు మమ్మల్ని చెయ్యడ్డంపెట్టి రోడ్డు వారకు మళ్లించారు. ఎందుకో అర్థం గాలేదు. గురూగారు సీరియస్‌గా ఛలానా రాస్తున్నారు.

"ఏవిటి సార్? ఏవిటి సంగతి? ఎందు కీ ఛలానా?" నా నిజాయితీ నిండిన ప్రశ్న.

"ఎర్ర దీపం." గురూగారు మితభాషిలా ఉన్నారు.

కానీ మేము క్రాస్ చేయడం మొదలెట్టినప్పుడు గ్రీనే ఉందండీ! మా ముందు బళ్లు నత్తనడక నడపటం వల్ల మే మా ఇరవై మీటర్ల దూరం దాటి ఇవతలి వేపుకు వచ్చేసరికి ఎర్రదీప మొచ్చేసింది... మాదేం తప్పుందీ?"

"అదంతా నాకు తెలియదు. మీరు రెడ్ లైట్ ఉండగా దాటారు."

హతోస్మి! ఏది దారీ? చేయని తప్పుకు జుల్మానానా! న్యాయం మనవేపు ఉందిగదా వీరత్వం ప్రదర్శిద్దామా? పోలీసుల ముందు వీరత్వమా మతిలేని మాటగాదూ!

"సార్! నే నే తప్పూ చేయలేదని నా మనసు చెబుతోంది." పోలీసుల్లో కూడా మహానుభావు లుంటారన్న దెవరు? రావిశాస్త్రిగారా? ఇతగాడు మనసు మనిషి అవగూడదూ?

బాణం వేసి చూసా.

"కబుర్లు చెప్పకండి. నాకు మీ మనసు కన్నా కళ్లే ముఖ్యం."

లాభంలేదు. ఇంకా మాట్లాడితే ఉన్న ఆ కాస్త గౌరవమూ ఊడేలా ఉంది!

బుద్ధిగా ఫైను కట్టేశా! ఇలా చేయని తప్పుకు జుల్మానా చెల్లించడం నా కిదే మొదటిసారి గాదు! ఈ అనుదినపు చిక్కు ప్రశ్నకు మా జనరల్ పెరీరాగా రే సమాధానం చెబుతా రో గదా!

*** *** ***

'ఏవిటి సార్? ఏవి టా అట్టహాసం?' ఉత్సుకత నిండిన శర్మ ప్రశ్న.

ఓ ట్రాఫిక్ జంక్షను. నాలుగు రోడ్ల కూడలి. అట్నుంచి కస్తూర్బా గాంధీ మార్గమూ, ఇట్నుంచి టాల్‌స్టాయ్ రోడ్డూ. మధ్యలో కాకుల మధ్య రాయంచలా వాహనాలు ప్రవేశించలేని ఓ బుల్లి ద్వీపం. ఆ ద్వీప మధ్యాన ఓ మేజా బల్ల. ఆ మేజా మీద ఔషధాల సీసాలు. మేజా ముం దో తెల్ల డ్రస్సు నర్సమ్మ. పక్కన మరో హెల్పరు కుర్రాడు. ఆ పక్కన ఓ స్ట్రెచరు. ద్వీపా న్నానుకొని రోడ్డు వారగా ఓ అంబ్యులెన్సు....

ఏవయిందీ? ఏక్సిడెంటా? మరి ఆ ఛాయలేం కనబడవేం?

కాస్త పరీక్షగా చూడగా ఓ పక్కన బ్యానరు 'రెడ్‌క్రాస్ వారోత్సవాలు'.

అదన్నమాట సంగతి!

కానీ ఆ నర్సుగారి మొహంలోకీ, వాళ్లు చేసిన ఏర్పాట్లలోకీ చూస్తే మే మింత రడీగా ఉంటే మరింక కష్టమర్లు రారేమీ - అన్న చిరాకూ, విసుగూ కనబడుతోంది! కనబడుతోందా?

వాళ్ల చిరాకూ విసుగూ వేల వేల రెట్లు పెరుగుగాక!

*** *** ***

'ఛచ్చాం! బ్రేక్ డౌనా!" అప్రయత్నంగా హాహాకారం చేశా.

పుస్తకాల ప్రదర్శన చూసి, కొండెక్కిన ధరల గురించి నిట్టూరుస్తూ ఐటీవో బ్రిడ్జి చేరేసరికి ఏడు దాటేసింది. చిరుచీకట్లు కమ్ముకొచ్చాయి. ట్రాఫిక్ పతాకస్థాయిని చేరుకొంది. అంత ట్రాఫిక్ నడిచే ఆ యమునా సేతువు మీద ఎక్కడైనా ఓ బండి మొండి కెత్తిందంటే చాలు - అదో బాటిల్‌నెక్‌గా మారి మిగిలిన వాహనాల గజ గమనాన్ని నత్తనడకగా మారుస్తుంది.

అల్లంత దూరాన ఆగి ఉన్న ఓ స్పీడ్ పోస్ట్ వారి ఎర్ర వ్యాను. డ్రైవరు క్రిందకు దిగాడు. ఇహ రిపేర్లు మొదలెడతా డు గాబోలు. డీటీసీ సిటీ బస్సుల డ్రైవరు మహారాజుల్లా బండిని అడ్డంగా వదిలేసి చేతు లూపుకొంటూ తన దారిన తాను పోకుండా కనీసం ఈ పోస్టు వారి డ్రైవరు రిపేరు ప్రయత్నాలు చేస్తున్నాడు... అదో మేలు...

వ్యాను క్రిందన దూరిన డ్రైవరు మెల్లగా బయటపడ్డాడు.

చేతిలో ఓ 'రోజుల' కుక్కపిల్ల.

జాగ్రత్తగా ఫుట్‌పాత్ మీద దా న్నొదిలి నిర్వికారంగా వ్యానెక్కి ముందుకు సాగిపోయా డతగాడు. మనిషి ప్రాణాలకే విలువలేని ఢిల్లీ రోడ్ల మీద ఊరకుక్కపిల్లలను సైతం లాలించే మహానుభావులు కూడా ఉన్నారన్నమాట.

*** *** ***

అనుకొన్నంతా అయింది. మరో వంద గజాలు యమునా నదీ సేతువు మీద ముందుకు సాగగా రూపురేఖలు కోల్పోయిన ఓ ఫియెట్ కారు దర్శన మిచ్చింది. ఆ గురూగారేదో పెద్దబండితో పోటీపడ్డట్టున్నారు. చివరకు ఖాళీ లేక రోడ్డు డివైడర్ని ముద్దాడేశారు. ఇంజనూ, బానెట్టూ తుక్కుతుక్కయిపోయి రెక్కలు విరిగిన జటాయువులా పడి ఉన్నా కారు బాడీ క్షేమంగానే ఉంది. కార్లో వాళ్లకు పెద్దగా దెబ్బలు తగిలుండవు.

కానీ ఈ జటాయువు పుణ్యమా అని - ట్రాఫిక్ బాటిల్‌నెక్. ఇలాంటి సమయాల్లో ప్రతి ఒక్కరూ 'గ్రాండ్ ప్రీ' కారు రేసుల డ్రైవర్లయిపోవడం సర్వసామాన్యం! కొంప లంటుకుపోతున్నట్లు కాస్తంత ఖాళీ దొరికినా పక్కవాడికి ఏమాత్రం చోటు

---

## — బాలీవుడ్‌లో 'ప్రపంచ సుందరి'

బాలీవుడ్ ప్రముఖ దర్శకు లంతా కట్టుగట్టుకుని తమ చిత్రాల్లో నటించమని వెంటపడుతుంటే 'ప్రపంచ సుందరి' ఐశ్వర్యా రాయ్ చిట్టచివరకు అంగీకారాన్ని వ్యక్తం చేసింది. అయితే అది దక్షిణాదికి చెందిన సంచలన దర్శకుడు మణిరత్నం చిత్రంలో! మణిరత్నం తన తర్వాతి చిత్రాన్ని ఐశ్వర్య ప్రధాన పాత్రగా నిర్మిస్తున్నాడు. సంచలన దర్శకుడు సంచలన సుందరితో నిర్మించే ఈ చిత్రం ఎంత సంచలనాన్ని సృష్టించనున్నదో వేచి చూడాల్సిందే!



చిక్కనివ్వకుండా ముందుకు దూసుకుపోవాలని ప్రతివారీ తాపత్రయం! అంత మర్యాదగా మసలితే పది నిమిషాల్లో ముగిసేదానికి ఈ పనికిరాని ప్రజ్ఞా ప్రదర్శన పుణ్యమా అని అరగంట! ఈ లోపల అరుపులు... ఆవేశాలు.. చెణుకులు.. హాస్యాలు.. కారు పొగల కన్నీళ్లు!

*** *** ***

అడుగడుగునా అడ్డు తగిలే గోమాతలూ, ఎద్దు మొద్దుల్లాంటి చదూకొన్న ఖరశ్రేష్ఠులూ, మధ్యన బిక్కచిక్కిన రిక్షాలూ, అదో రణరంగం!

నలమహారాజు చాకచక్యంలో మా రెండు చక్రాల రథాన్ని తోలుకుంటూపోతుండగా - దారిలో ఓ అభినవ అమితాబ్ బచ్చన్న!

త్రిశూల్ సినిమాలో డైనమెట్ల వత్తికి నిప్పంటించి నిర్వికారంగా జంకూ గొంకూ లేకుండా మందగమనంతో నడిచి వెళ్లిన సూపర్‌స్టార్ గారి బాణీలో పిచ్చెక్కించే ఢిల్లీ ట్రాఫిక్‌ను చిన్నచూపు చూస్తూ యువరాజులా రోడ్డును దాటుతున్నా రా గురూగారూ! సందేహం లేదు - లోకల్ దాదా అయి ఉండాలి.

అన్ని వాహనాలూ ఆగిపోయి ఆ 'మృగ' రాజుకు దారి ఇస్తున్నాయి కానీ ఏ కారులో నన్నా శతృఘ్నుడి లాంటి మరో కొమ్ములు దిరిగిన దాదా ఉండి ఉంటే ఆ రోడ్డు పొట్లేళ్ల పందెపు వేదికగా మారేది గాదూ!

*** *** ***

"అరే పాగల్... చావాలంటే నా స్కూటరే దొరికిందా?" పక్కన ఓ స్కూటరు సర్దార్జీగారి హుంకరింపు.

అవును మరి. నట్ట నడి రోడ్డు మీద కనీసం రెడ్‌లైట్ జంక్షన్నా కాని చోట హఠాత్తుగా సిటీ బస్సులోంచి క్రింది కురికి స్కూటరు చక్రానికి అడ్డంబడితే ఎవరికైనా ఒళ్లు మండదూ?

బస్సులోని ఫూంగున దుమికిన ఆ ఛోటా హీరోగారి పళ్లికిలింపు, కోతినవ్వు. 'సర్దార్జీ! బారా బజ్ గయా!' అన్న వెర్రి జోకు.

చాలు. ఆమాత్రం ప్రేరణ చాలు. సర్దార్జీ గారు ఆ ఛోటా హీరోగారి తల్లినీ, అమ్మమ్మనూ, నాయనమ్మనూ, చెల్లెళ్లనూ, పెళ్లాలనూ పేరుపేరున పరామర్శించారు. అన్ని పంజాబీ బూతులూ నా కర్థంగాకపోవడం - అదో గుడ్డిలోమెల్ల! బారా బజేలూ, పంజాబీ బూతులూ సంగతెలా ఉన్నా ఆ ఛోటా హీరోగారు బస్సులోంచి క్రింద కురికిన క్షణానే సర్దార్జీగారి స్కూటరు చక్రాల నడుమన ఇరుక్కోకపోవడం ఓ మిరకిల్ అనిపించింది.

సర్దారు గారి ఆగ్రహం అవధులు మించిన మాట నిజమే అయినా అర్థరహితం మాత్రం కానేకాదు.

*** *** ***

'ఒకే తప్పును రెండుమార్లు గాడ్దెలు కూడా చేయలేవు' అన్న పెద్దలమాట బుర్రలో మెదలగా ముందు నున్న ట్రాఫిక్ జంక్షన్లో ఆరెంజి దీపాన్ని దూసుకుపోకుండా నిలకడగా స్కూట రాపా! ఆరెంజీనీ, ఆ తర్వాత వచ్చే ఎరుపునూ దాట నిచ్చి పచ్చదీపం వచ్చిన తర్వాతే సాగాలని యోచన.



## అక్షయ్ పెద్దమనసు

హీరో అక్షయ్‌కుమార్ కేవలం అమ్మాయిలనే కాదు, అభిమానులను కూడా ప్రేమిస్తాడని ఇటీవల ఒక సంఘటన రుజువు చేసింది. అక్షయ్‌కు ఇంకా పెళ్లికానప్పటికీ చిన్నపిల్లలంటే అతనికి చచ్చేంత ప్రాణం. ఇటీవల బికనీర్‌లో ఒక షూటింగ్ సందర్భంగా అక్షయ్‌ను చూడటానికి వచ్చి అతని అభిమాని, నాలుగేళ్ల పసివాడు కిందపడ్డాడు. ఆ బాబుకు క్యాన్సర్ అని కూడా తెలియడంతో కదిలిపోయిన అక్షయ్, ఆసుపత్రికి వెళ్లి గంటలతరబడి అతని పక్కనే కూర్చుని ఓదార్చాడు. అంతేకాదు, చికిత్స కోసం అతన్ని బొంబాయి తీసుకువస్తే అక్కడ కూడా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించాడు.

— మసూద్ అన్సారీ

'ఏవిటి సంగతీ?' పక్కనుండి ఓ నియోరిచ్ మారుతీ గాండ్రింపు.

"పసుపుపచ్చ దీపం." క్షమాధ్వని నిండిన నా సమాధానం.

"అయితే? ఆరెంజికూడా ఆగుతారా? తప్పుకో" ఆజ్ఞ.

తొలిగా. ఆ యత్నంలో స్టాప్‌లైన్ దాటేశా. మళ్లీ ఫైన్ కట్టాలా?

ఆ మారుతీ కారు దొరికిన ఆ ఖాళీలోంచి ఎర్రలైటును వెక్కిరిస్తూ ఎగిరిపోయింది.

అవును. నిజమే. విజయలక్ష్మి వీరుల్నే వరుస్తుంది!

*** *** ***

మెల్లగా ఆగిన వాడిలా, తనిష్టం ప్రకారం మా ముందు నడుస్తున్న డీటీసీ సిటీ బస్సు కీచు కీచు మని మొత్తుకుంటూ హఠాత్తుగా ఆగింది.

మళ్లీ ఏం తగలడిందో మరి!

అరె... ఏమి టీ జనాలు గుండు దెబ్బతిన్న పక్షిగుంపుల్లా, పులిని చూసి బెదిరిన జింకల గుంపుల్లా - ఎందు కలా ఛెంగు ఛెంగున బయటకు దూకుతున్నారూ? చెల్లాచెదురవుతున్నారూ?

అంత గందరగోళం. కేకలు పెడబొబ్బలు..ఏడుపులు... ఆ హడావుడి మధ్య వినపడీ వినపడనట్టు రెండు అక్షరాలు - బాంబు.

అవునా! ఆ బస్సు క్షణాల్లో పేలనున్న జ్వాలాముఖా?

రోజూ పేపర్లో చూస్తోన్న బాంబ్‌బ్లాస్ట్ నీ రోజు ప్రత్యక్షంగా చూడబోతున్నానా? బస్సు పట్టుమని పది గజాల దూరంలో లేదు - బాంబు దెబ్బ మాదాకా రాదూ? 'మరణంతో ముఖాముఖీ' అంటారు ఇదేనా?

హడావుడి తగ్గింది. మళ్లీ అందరూ గలగలా కబుర్లాడుతూ బసెక్కుతున్నారు. అది బాంబు గాదట - బ్యాటరీ బాక్సులో స్పార్కు లట!

*** *** ***

"ఫంపేసారు గురూగారూ!" రెం డడుగులు గాల్లో కెగిరిన శర్మ లక్కీగా మళ్ళీ తన పిలియన్ సీట్లోనే వచ్చి పడ్డాడు!

"సారీ శర్మా! చెప్పడం మరచిపోయాను. ఇక్కడో చంద్రమండలం క్రేట రుందని హెచ్చరించడం మర్చిపోయాను."

"సర్లెండి గానీ, అంత పెద్ద గుంటలోంచికూడా మీరు ఏమాత్రం తొట్రుపడకుండా చిద్విలాసంగా బండి నెలా నడపగలిగారూ?"

"రోజూ నడపడం వల్ల నా కీ దారంతా పరచిన పుస్తకం. మన అరచేతి రేఖల్లాగా ఎక్కడ గుంట లున్నాయో, ఎక్కడ స్పీడు బ్రేక ర్లున్నాయో, ఎక్కడ మూతల్లేని డ్రైనేజి గుంట లున్నాయో - అంతా నాకు కరతలామలకం. అంచేత నా వాహనం ఈ రోడ్ల మీద నల్లేరు మీది బండిలా సాగిపోగలదు."

*** *** ***

"సారీ శర్మ! ఇబ్బంది పెట్టానా నా డ్రైవింగులో? భయం వేసిందా? వెధవది రాష్‌గా నడపడ మో వ్యసనమయిపోయిం దనుకో."

"అబ్బే అదేంలేదు. అసలు మీ డ్రైవింగు చాతుర్యానికి ముచ్చట కలిగింది. ఏ కారు రేసులకో వెళ్లతగిన వారు మీరు. ఓ సారి వెళ్లి చూడరాదూ! మీరు ఫాస్ట్‌గా నడిపిన మాట నిజమే గానీ రాష్‌గా గాదు. రెండింటికీ తేడా లేదూ? రేసులు ట్రై చెయ్యండి."

శర్మ మాటల్లో వ్యంగ్యం ఉందా? భుజాలు తడుముకోకతప్పలేదు!

*** *** ***

ఆ రాత్రి నా కో కల వచ్చింది.

ఓ మూడు నక్షత్రాల ఆసుపత్రిలో, మా కంపెనీ వారి ఖాతాలో, ఎదురుగా ఉన్న ఓ కప్పీకి కుడికాలును వేలాడదీసి పట్టుపరుపుల మంచం మీద పవళించి ఉన్నానట.

ఆ రోజే వేసిన తెల్లని టినోపాల్ లాంటి కాలి ప్లాస్టరు మీద స్కెచ్చి పెన్నుల సాయంతో తన కళా హృదయాన్ని ప్రపంచానికి ప్రదర్శించే ప్రయత్నంలో మా పదేళ్ల పుత్రరత్నం నిమగ్నుడై ఉన్నాడట.

గుడ్ల నీళ్లు గక్కుకుంటూ [అవి బత్తాయిలు వలిచిన ఫలితమని నా అనుమానం] పళ్లరసం పిండి నా కందించే ప్రయత్నంలో ఉందట మా ఆవిడ.

అంద వచ్చిన విరామాన్ని ఆబగా అందిపుచ్చుకొని ఆర్థర్ హైలీగారి 'ది వీల్స్' అన్న నవలా రాజ రసాస్వాదనలో తలమునక లవుతూ ఉన్నానట నేను! ●